క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రూరల్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విశాఖ ఆపరేషన్స్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా టి.నగరపాలెం, కనకలపేట, మజ్జివలస, లక్ష్మీపురం, శింగనబంధ, విజయరాంపురం, కృష్ణంరాజుపేట, మద్దిపేట, నారాయణరాజుపేట గ్రామ పంచాయతీలు, వాటి పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇళ్లలోకి భూగర్భ డ్రైనేజీ మురుగు



యూజీడీ నుంచి బయటకు వస్తున్న మురుగు

పీఎం పాలెం: పీఎం పాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ ఎల్ఐజీ సెక్టార్-2లో భూగర్భ డ్రైనేజీ మురుగు ఇళ్లలోకి వస్తుండటంతో నివాసితులు అవస్థలు పడుతున్నారు. దుర్గంధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం హౌసింగ్ బోర్డు కాలనీ నిర్మాణంలో భాగంగా భూగర్భ డ్రైనేజీ సిస్టంను ఏర్పాటు చేశారు. డ్రైనేజీ నిర్వహణ కోసం కొన్ని చోట్ల జంక్షన్ హోల్స్ నిర్మించారు. అంతవరకు బాగానే ఉన్నా, డ్రైనేజీలు పూడుకుపోవడంతో ఆ హోల్స్ నుంచి మురుగునీరు పైకి ఉబికి, సమీపంలోని ఇళ్లలోకి ప్రవేశిస్తోంది. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో మరింత ఇబ్బందులు తలెత్తే ముప్పు ఉందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి



మత్స్యకారుల అవగాహన సదస్సులో పాల్గొన్న మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: తీర ప్రాంతంలో మత్స్యకారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో బుధవారం నిర్వహించిన మత్స్యకారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తీరం వెంబడి అనుమానిత వ్యక్తులు కనిపించినా, తెలియని బోట్లు పయనించినా తమకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్ట్‌ను బోధించడానికి అతిథి అధ్యాపకుని నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ బుధవారం తెలిపారు. కంప్యూటర్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం, ఆపైన మార్కులు సాధించిన వారు లేక పీహెచ్‌డీ పొందినవారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గలవారు 22 తేదీన ఉదయం పది గంటలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

పూటుగా మద్యం సేవించి వ్యక్తి మృతి

మధురవాడ : పూటుగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మారికవలస ఆర్‌జీకే కాలనీలో చోటుచేసుకుంది. పీఎం పాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. మారికవలస ఆర్‌జీకే కాలనీ 92వ బ్లాకులో నివాసముంటున్న వరదరాజు (46) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి ప్రవర్తన నచ్చక నాలుగేళ్ల క్రితం భార్య వదిలిపెట్టి వెళ్లిపోయింది. తల్లి ఈశ్వరమ్మతో కలిసి 92వ బ్లాకులో ఉంటున్నాడు. అతడు ఇదే బ్లాకులో వేరే గదిలో ఉంటున్నాడు. కొద్ది రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. పూటుగా మద్యం సేవించి నాలుగు రోజుల క్రితం మరణించి ఉంటాడని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మృతదేహం నుంచి దుర్వాసన వస్తోంది. స్థానికుల సమాచారంతో పీఎం పాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఏ వీధి చూసినా.. అంధకారమే..



- వెలగని వీధిలైట్లు
- హైవే, మాస్టర్ ప్లాన్ రోడ్లు.. ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి
- పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదుల వెల్లువ
- పట్టించుకోని అధికారులు

జీవీఎంసీ వార్డులు **9** (5 నుంచి 13)

ప్రస్తుతం ఉన్న లైట్లు: **13, 269**

ఇంకా కావలసినవి: **1000** పైనే (అధికారిక లెక్కల ప్రకారం)

వాస్తవంగా అవసరమైనవి: **3**వేలకు పైనే

మధురవాడ: నగర పరిధిలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం మధురవాడ. ఐటీ కంపెనీలతో పాటు ముఖ్యమైన కార్యాలయాలు ఉన్న ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో వీధిలైట్లు వెలగక ఎక్కడ చూసినా అంధకారమే కనిపిస్తోంది. హైవే, మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు వీధిరోడ్లలోనూ ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ రహదారుల్లో వీధి లైట్లు లేక వాహనచోదకులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా వీధిలైట్లు ఏర్పాటు విషయం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి ..

శివారు కాలనీల మాట అటు ఉంచితే ఎండాడ నుంచి బోయిపాలెం వరకు హైవేలో ఉన్న సెంట్రల్ లైటింగ్, కొమ్మాది, మిథిలాపురి వుడా కాలనీ – ఐటీ సెజ్, మారికవలస–తిమ్మాపురం, రేవళ్లపాలెం–బక్కన్నపాలెం–కొమ్మాది, పీఎంపాలెం మెయిన్ రోడ్డు, హరిత, ఐటీ ప్రాంతంతో పాటు ఆర్‌టీసీ డిపో, నగరంపాలెం తదితర ప్రధాన రహదారులు.. హైవే, మాస్టర్ ప్లాన్ రోడ్లలలో కూడా ఎక్కడ చూసినా చీకట్లు అలముకున్నాయి. లైట్లు వేయించండి మహాప్రభో అని కార్పొరేటర్లు కూడా కమిషనర్, మేయర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి.




జోన్ పరిధిలో లైట్ల వివరాలు	వార్డు	ఉన్న లైట్లు	ఇంకా కావలసినవి	వార్డు	ఉన్న లైట్లు	ఇంకా కావలసినవి
	5	2172	200	9	814	50
	6	2513	200	10	564	50
	7	1840	100	11	591	50
	8	3083	200	12	678	50
				13	1014	100
				మొత్తం	13,269	1000

వెయ్యి లైట్లు వెలగడం లేదు

జీవీఎంసీ జోన్ పరిధిలోని 5 నుంచి 13 వరకు 9 వార్డుల పరిధిలో 40 వాట్స్, 20 వాట్స్, 70 వాట్స్, 110 వాట్స్, 120 వాట్స్ విద్యుత్ లైట్లు 13,269 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 1247లైట్లు వెలగడం లేదని 6 నెలలు క్రితం అధికారులు తెలిపారు. తాజాగా వారి లెక్కల ప్రకారం 1000 వరకు ఇంకా కొత్తవి అవసరం. వారి లెక్కల్లో చూసినా 6 నెలల కాలంలో కనీసం 250 లైట్లు కూడా కొత్తవి వేయలేదు.







ఫిర్యాదు చేసి రెండు నెలలైనా..



నగరంపాలెం రోడ్డులో లైట్లు వెలగడం లేదు. రెండు నెలల క్రితం పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు ఇచ్చాను. కనీసం స్పందన లేదు. నివాసాలు ఉన్న చోట అయినా లైట్లు వేయమని అడిగితే లైట్లు కొత్తవి రాలేదు అని చెబుతున్నారు. వీరి తీరు మారకపోతే ఆందోళన తప్పదు.

– వాంద్రాసి సత్యనారాయణ, సీపీఐ నాయకుడు

చాలాకాలంగా లైట్లు వెలగడం లేదు



మా ఏరియాలో లక్ష్మీదేవి చెట్టు, బొట్టవానిపాలెం రోడ్లలో చాలా కాలం నుంచి లైట్లు లేవు. చీకటిలో బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. హైవే, మధురవాడ మార్కెట్, శివశక్తినగర్ పరిసర ప్రాంతాల్లో మరింత ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు స్పందించాలి.

–పోలిమాటి దేవి, మధురవాడ

పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులూ బుట్ట దాఖలే..

వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పీజీఆర్‌ఎస్‌లో చేసుకున్న ఫిర్యాదులకు మోక్షం కలగడం లేదు. ఏడాదిగా వచ్చిన ఫిర్యాదులు అన్నీ బుట్ట దాఖలే అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

పార్కులో లైట్లు లేవు



పీఎం పాలెం 2వ బస్టాప్, హౌసింగ్ బోర్డ్ కాలనీ పరిసర ప్రాంతాలతో పాటు సుగర్ కేన్ లేఅవుట్ పార్కులో కూడా లైట్లు లేవు. దీని కోసం జీవీఎంసీకి ఫిర్యాదు ఇచ్చాను. ఒకటి రెండు వేశారు. మిగిలినవి వదిలేశారు. పార్కు మొదటి నుంచీ ఇదే పరిస్థితి.

–కామకోటి కాశీప్రసాద్, పీఎం పాలెం

లైట్ల కొరత ఉంది



3లైట్లు కొరత ఉంది. పాత లైట్లు పాడైతే రిపేర్లు చేయిస్తున్నాం. వార్డుకు 50 చొప్పున కొత్త లైట్లు వచ్చాయి. 5, 6, 7, వార్డుల్లో కొత్తవి వేశాం. ఇంకా 8, 9, 10 ,11, 12,13 వార్డుల్లో వేయాల్సి ఉంది. పూర్తి స్థాయిలో వీధిలైట్లు వెలిగించేందుకు తక్షణ చర్యలు చేపడతాం.

– కొట్యాడ కనకమహాలక్ష్మి, జోనల్ కమిషనర్, జోన్–2

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని శివజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయిని సీహెచ్. రోజామణి, వ్యాయామ ఉపాధ్యాయిని సత్యవతి మాట్లాడుతూ స్థానికుల సహకారంతో బాలికల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినుల సంఖ్య సగానికి పైగా పెంచామన్నారు. అదే సహకారం ఇప్పుడు కూడా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ లక్ష్మి, శ్రీదేవి, రామలక్ష్మి, భాగ్యవతి, కామేశ్వరి, ప్రభావతి, సీఆర్పీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వరి నారుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కృష్ణాపురంలో వరి నారును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త కుమారి

పద్మనాభం: వాతావరణ పరిస్థితుల వల్ల వరి నారుకు పురుగు ఆశించినందున సస్య రక్షణ చర్యలు చేపట్టాలని యలమంచిలి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి సూచించారు. కృష్ణాపురం, పాండ్రంగి పంచాయతీ భద్రయ్యపేట గ్రామాల్లో పర్యటించిన ఆమె వరి నారును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి నారును రసం పీల్చే, తామర పురుగులు ఆశించాయన్నారు. పురుగులు ఆశించడం వల్ల వరి నారు కొనలు పసుపురంగు లోకి మారి ఎండి పోతాయని తెలిపారు. వీటి నివారణకు డైమిథొయేట్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి విత్తనాలను ముందుగా శుద్ధి చేసుకోవాలన్నారు. కిలో విత్తనాలను రెండు గ్రాముల కార్బిండిజమ్ మందుతో శుద్ధి చేయాలన్నారు. ఆమె వెంట ఏవో ఎంవీఎస్ చలం ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



రెడ్డిపల్లిలో సేకరణను పరిశీలిస్తున్న సీఈవో నారాయణమూర్తి

పద్మనాభం: వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యం క్షీణించకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి, కోరాడ గ్రామాల్లో బుధవారం పర్యటించిన వారు స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల మీద చెత్త వేయకూడదన్నారు. రక్షిత మంచినీటి పథకాలకు క్లోరినేషన్ చేయాలన్నారు. వారి వెంట ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మీనాకుమారి పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

పద్మనాభం: వెంకటాపురంలో కోదండ రామస్వామి అలయ తృతీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

పద్మనాభం: పద్మనాభం మండల ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం రాత్రి పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగాయి. మండల శాఖ అధ్యక్షునిగా రొంగలి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గుసిడి ఎర్రయ్య, ఉపాధ్యక్షులుగా అవనాపు ఆదిబాబు, పి.విద్యా మోహన్, ఎం.రామునాయుడు, ప్రధాన కార్యదర్శిగా కె.గౌరినాయుడు, కార్యదర్శులుగా ఎస్.సుభాషిణి, కె.మోహన్, బి.మహేష్, వి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ సభ్యులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.కరుణాకర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రకళ, జిల్లా మాజీ అధ్యక్షులు ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



రోడ్డుపై కుప్పలుగా పడి ఉన్న వ్యర్థాలు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది, ఎస్సీ కాలనీ, చివరి బస్టాప్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఈ ప్రాంతాల్లో రోడ్డు మీద చెత్త కుప్పలు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది రోజుల నుంచి ఈ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్య ధోరణితో ఈ సమస్య వేధిస్తోందని, జెడ్సీ కనకమహాలక్ష్మి ప్రత్యేక దృష్టి పెట్టి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించనివ్వొద్దు

సీపీఎం ఆధ్వర్యంలో కార్మికవాడలో ర్యాలీ



కార్మికవాడలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఎం నాయకుల ర్యాలీ

తగరపువలస: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు కార్మికవాడలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇంటింటికీ స్టిక్కర్లు అంటించి, కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. పార్టీ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ ముందుగా కార్యాలయాలు, వ్యాపారసంస్థలకు అదాని స్మార్ట్ మీటర్లు బిగించి, తరువాత దొంగచాటుగా ఇళ్లకు బిగించడానికి వస్తున్న వారిని అడ్డుకోవాలన్నారు. పొరపాటున ఈ స్మార్ట్ మీటర్లు బిగిస్తే వినియోగదారులపై విపరీతమైన భారం పడటం ఖాయమన్నారు. ఈ ప్రీ పెయిడ్ విద్యుత్ మీటర్ల కారణంగా ముందస్తు సమాచారం లేకుండానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడమే కాకుండా యూనిట్‌కు పగటివేళ ఒక ధర, రాత్రివేళ మరొక ధర ఉంటాయన్నారు. నిరసనలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, మంగశ్రీ, రాంబాయి, వెంకయ్యమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.



మల్లయ్యపాలెంలో స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న పైడిరాజు తదితరులు

మల్లయ్యపాలెంలో..

మధురవాడ: స్మార్ట్ మీటర్ల వలన బిల్లుల భారమే కాకుండా, వాటి ఏర్పాటు భారాన్ని కూడా వినియోగదారులపై వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు విమర్శించారు. సింగిల్ ఫేజ్ మీటర్లకు రూ. 8,927, త్రీ ఫేజ్ మీటర్లకు రూ.17,286 చొప్పున వినియోగదారులు భరించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మొత్తాన్ని 93 నెలల పాటు బిల్లుతో పాటు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీరి దోపిడీకి అడ్డూ ఆపూ లేకుండా పోతోందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా అంతా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మల్లయ్యపాలెం, అయోధ్యనగర్ పరిసర ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా నాయకులు వి.సత్యనారాయణ, ఎంఎస్ పాత్రుడు, డి.రాజేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలు వృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఏపీసీ చంద్రశేఖర్

మధురవాడ: ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు సూచించారు. విద్యార్థులు 3వ తరగతి నాటికే చదవడం, రాయడం, సంఖ్యా పరిజ్ఞానం సాధించేలా చూడాలన్నారు. స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధురవాడ సిమ్స్ కళాశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని మూడో రోజు బుధవారం ఆయన పరిశీలించారు. అన్ని పాఠశాలల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంపై దృష్టి పెట్టడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం నిపుణ్ భారత్ మిషన్ లక్ష్యాలుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంవో లక్ష్మి, రిసోర్స్ పర్సన్లు, జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోవాలా.. రోడ్డు మీద విన్యాసాలా?



అస్తవ్యస్తంగా ఆటోలు



వాహనాల రద్దీ ఉన్న చోట యూటర్న్ ఇలా..



రోడ్డుపై ఇష్టానుసారం యూ టర్న్ తీసుకుంటూ..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలస అనిట్స్ బస్టాప్ వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటోడ్రైవర్లు తమ వాహనాలతో విన్యాసాలు చేస్తున్నారు. తగరపువలస నుంచి సంగివలస వరకు ఆటోలతో వచ్చి సడెన్‌గా యూటర్న్ తీసుకుంటున్నారు. ఈ కూడలిలో ఒక వైపు అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలకు వచ్చే విద్యార్థులు, అనిల్ నీరుకొండ ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు అవతలి వైపు ముగ్గురు అమ్మవార్ల ఆలయానికి వందల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తారు. వీరంతా వాహనాల కోసం రోడ్డు పక్కనే వేచి చూస్తూ ఉంటారు. దీంతో ఈ ప్రాంతం రద్దీగా ఉండటమే కాకుండా తరచూ ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. జాతీయరహదారితో పాటు సర్వీస్‌రోడ్డుపై కూడా వాహనాలు వేగంగా సాగిపోతుంటాయి. అలాంటి కూడలిలో ఇటీవల ఆటో కార్మికులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముందూ వెనుక చూడకుండా ఆటోలను ఇష్టం వచ్చినట్టుగా అకస్మాత్తుగా యూటర్న్‌లు తీసుకుంటున్నారు. భవిష్యత్తులో ప్రమాదాలేవీ జరుగకుండా పోలీసులు ఈ ప్రాంతంలో ఆటోల విన్యాసాలపై నిఘా ఉంచాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.